కాలిన చేతులు

ఆ రోజు ఆదివారం.

అయినా సూర్యోదయమయింది.

కాక ఏంచేస్తుంది ?

జస్టిస్ శేఖరంగారికి రాత్రంతా నిద్రపట్టలేదనీ, కలవరింతలతో బాధ పడుతున్నాడనీ దానికేం తెలుసు ?

కిటికీలోనుంచి వచ్చే వేడి కిరణాలు చురుక్కు మనిపిస్తున్నా శేఖరం కల కరిగి పోలేదు.

రైలు పట్టాలదాక వెంబడించిన వ్యక్తి ఇంకా తరుముతునే వున్నాడు. ఎవరినన్నా సహాయానికి పిలుద్దామని మనసులో అనిపించినా గొంతు పెగిలిందికాదు. మళ్ళీ మధ్య మధ్య జరుగుతున్నది కలా నిజమా? అని అనుమానంవచ్చి 'కలే' అయివుంటే బాగుంటుందనుకున్నాడు. ఆగంతకుడి ముఖం గుర్తుపట్టగలిగితే మర్నాడు పోలీసు రిపోర్టు ఇచ్చి ఆ మనిషికోసం వెతికించ వచ్చుననుకున్నాడు.

కల అయిపోవసోంది. కలలో మనిషి ఒక్కసారి ముఖం చూపించి మాయమయి పోయాడు. ముఖంమీద పెద్ద పుట్టుమచ్చ, గిర జాల జుట్టు....అతనే...సింగడు !

శేఖరం కల కరిగిపోయింది. ఉలిక్కిపడి లేచి కూర్చుని కళ్ళు నులుముకుని నాలుగు పైపులా కలియచూశాడు. సర్వరు వచ్చి 'అయ్యా.. కాఫీ తెచ్చానండీ....'అంటున్నాడు. కాఫీ ఆవిరిలోనుంచి సింగడు కన పడుతున్నాడు. శేఖరం కాఫీ కప్పును ఎడంచేత్తో ఫెడేలుమని కొట్టేసి 'యిది నాకు వద్దు తీసుకుపో....' అంటూ అరిచాడు.

జ్యూరీల సమ్మతిమీద సింగడిమీద నేరం ఆరోపించి మరణ శిక్ష విధించి సరిగ్గా వారం రోజులుగూడా కాలేదు. క్రిందటి రోజునే లెక్క ప్రకారం వురితీసి వుంటారు. శేఖరం గొణుక్కున్నాడు. సింగని రూపం కళ్ళల్లో మెదులుతోంది.

సింగడితో మొదటి పరిచయం శేఖరానికి మామిడితోటలో అయింది. చెట్టెక్కి పచ్చడికాయకి- బాగా నదురుగా వున్నవాటిని కోసి కింద బుట్టలోకి గిరవాటు వేస్తున్నాడు.

'ఎవర్రా వెంకయ్యా చెట్టెక్కింది?' శేఖరం అడిగాడు తోటమాలిని.

'మనోడేనయ్యా...ఆళ్లింటికాడ పనేమిలేదంటే...నాకింద జీతాని కుండరా అని తోలుకొచ్చాను...' సమాధానం చెప్పాడు వెంకయ్య.

శేఖరం చెట్టువైపుకు దృష్టి ప్రసరించాడు. ఎదురు తిరిగిన కండరాలు. ఉక్కు తీగెల్లాగా పైకి నల్లగా కనపడుతున్న నరాలు. గిరజాల జుట్టు. కళ్ళల్లో ఎర్రటి గీరలు. మంచి వస్తాదులాగ కనపడ్డాడు శేఖరానికి.

'మంచివాడేనా వెంకయ్యా....'

'మామడిసేనండీ....మా యింట చెడ్డ యిత్తనం యాడనుంచి వస్తుందండీ....'

శేఖరం నవ్వాడు. వెంకయ్య ఔనన్నట్లు తల ఊపాడు.

పాకలోనుంచి అప్పుడే వచ్చిందో పడుచు. వస్తూనే శేఖరాన్ని చూచి 'దండమండి...అయ్యగారూ...' అంది.

శేఖరం నమస్కారం స్వీకరించినట్లు ఒక చిరునవ్వు విసిరాడు.

'ఏమే సుబ్బీ...నువ్విక్కడికి వచ్చి మూడేళ్లు కావటంలా...'

'కాకేం దొరా....'

'ఈ కొ స్త కాలంలో మా తోట మూడు కాపులు కాసింది. నీ కడుపున గూడా వకకాయ కాస్తే మీ అమ్మా అయ్యా సంతోషిస్తారు గాదుటే....'

సుబ్బి సిగ్గుతో కుంచించుకు పోయింది. వెంకయ్య కొంచెం తికమక పడ్డాడు. సింగడు చెట్టుమీదనుంచి కిందకి దిగి వచ్చాడు.

'దేవుడి దయ కలగాలిగాని...మన చేతుల్లో ఏముందండీ?' సింగడు పెకిలిగా నవ్వాడు. వెంకయ్య కళ్లెర్ర చేశాడు.

'ఏమిటిరా అది...వెర్రివాగుడు నువ్వూను? మన అయ్యగారు.... దండం పెట్టు...'

సింగడు బిక్క ముఖం పెట్టి నమస్కారం పెట్టాడు. శేఖరం మామూలుగా మళ్ళీ నవ్వాడు. సింగడు 'నా కెంతమంది అయ్యలురా' అన్నట్లు చూశాడు.

'మీవాడు గట్టివాడేనోయ్...' అన్నాడు శేఖరం.

సుబ్బి అక్కడినుంచి వెళ్లిపోయింది.

ఆరోజు రాత్రి వెంకయ్య సుబ్బిఉన్న గదిలోకి వస్తూ 'మన అదృష్టం అంత జోరుగా వున్నట్టులేదే' అన్నాడు.

'మన అదుష్టానికి వంకెవరు పెడతారు. నిక్షేపం లాగుంటే....'

'అదిగాదే...నువ్వీడకొచ్చి మూడేళ్ళయిందా ఇయ్యాల అయ్యగారు అన్నమాట గుర్తుకొచ్చేటప్పటికి....' నసిగాడు.

'దానికి నన్నేం చెయ్యమంటావు. దేవుడి దయ వుండాలిగాని..'

వెంకయ్య సుబ్బిని చేతుల్లోకి తీసుకుని 'మా సుబ్బి చాలా మంచిదే' అన్నాడు 'ఫో...!' విసుక్కుంది సుబ్బి.

అర్ధరాత్రి పన్నెండు గంటలయింది. సింగడు కాలుగాలిన పిల్లిలాగా తోట అంతా తిరుగాడుతున్నాడు. ఒకటి రెండు సార్లు పెద్దగేటు దాటి రోడ్డుమీదకు పోయి వచ్చాడు. ఎక్కడా జన సంచారమే లేదు. మళ్ళీ వేసవికాలం వచ్చేవరకూ ఈ మామిడి కాపు కాయదు గాబోలు! సంవత్సరానికొకసారి! అదీ బాగానే వుందనుకున్నాడు.

రోజు అంతా బయటనే పడుకునే వాళ్లు. ఈరోజు వెంకయ్య, సుబ్బి లోపలకు పోవటంతో సింగడికి మహా చీకాకుగా వుంది. మధ్య మధ్య గుడిసెలోనుంచి వస్తున్న మాటలు శూలాల్లాగా గుచ్చుకుంటున్నాయి. అప్పుడే తెల్లవారిపోతే బాగుండును అనుకున్నాడు సింగడు. అసలు తెల్లవారకుండా వుంటే బాగుంటుంది అనుకున్నాడు వెంకయ్య.

వీళ్ళ మాటలు లెక్క చెయ్యకుండా సూర్యోదయం అయ్యేముందు మామూలుగా తెల్లవారింది.

సింగడు కాయలు కోయటం, సుబ్బి బుట్టల్లో కెత్తటం, బుట్టలన్నీ దొంతర్లుగా తయారవుతున్నాయి. వెంకయ్య గేటు దగ్గర ముక్కాలి పీట వేసుకుని డబ్బు పోగుచేస్తున్నాడు- వాడుక దార్లదగ్గరనుంచి. డబ్బు దగ్గర ఏదో పేచీ వచ్చి బిగ్గరగా మాట్లాడుతున్నాడు వెంకయ్య.

సింగడు సుబ్బి నెత్తిన ఆఖరి బుట్ట పెట్టుతూ 'నిన్న పొద్దున... మన అయ్యగారేమన్నారో గుర్తుందా?' అన్నాడు వెకిలిగా నవ్వుతూ. పట్టిన చెమటను తుడుచుకుంటున్నట్లు జబ్బలు చరుచుకున్నాడు. సుబ్బి వయ్యారంగా బుట్ట అందుకుని 'ఆఁ'.... అంది.

ఆరోజు రాత్రి సుబ్బి, వెంకయ్య ఎందుకనో తగాదా పడ్డారు. సింగడు ఆరుబయట మంచంమీద పడుకుని ఈలపాట పాడుతున్నాడు. సుబ్బి విసురుగా తలుపు తీసుకుని బయటకు వచ్చింది- చాపచుట్టతో సహా. వెంకయ్య వెనుకగా వచ్చాడు, చాప చుట్ట తీసుకుని.

'ఈ లెక్కనయితే వక్క క్షణం వుండనంటోంది'సుబ్బి. వెంకయ్య నోరు మెదపకుండా కోరచూపులు చూస్తున్నాడు. సింగడు ఈలపాట పాడుతూనే వున్నాడు.

'వెధవ పాటా నువ్వూనూ....ఆపెయ్యరాదూ, విసుగు పుట్టు తుంటే...'

సింగడు పాట ఆపలేదు. 'నీ సొమ్మ ఏంపోయింది...ఆడు పాడుకుంటుంటే' అంది సుబ్బి. సింగడు శ్రుతిపెంచాడు. వెంకయ్య చాప చెంగుక్కన విదిలించి నేలమీద పరిచాడు.

మళ్ళీ తెల్లవారింది. చెట్టుమీదనుంచి కాయ దిగుతోంది. 'కాయలన్నీ కోసేటంతవరకూ గంపల కెత్తవద్ద'ని సింగడు ముందుగానే ఆర్డరు జారీ చేశాడు. వెంకయ్య పోయి గేటు దగ్గర నిలబడ్డాడు, వత్తనదార్ల దగ్గరనుంచి పైకం వసూలు చేసుకోవటానికి.

కాయలన్నీ కావలసినవి కోయటం కాగానే చెట్టు దిగి వచ్చి 'గంపలన్నీ తీసుకురా' అన్నాడు.

సుబ్బి, సింగడు కలిసి కాయలన్నిటినీ గంపల కెత్తుతున్నారు. సింగడే ముందర పెదిమ కదిపాడు.

'ఏమిటే సుబ్బి...రాత్రి మీ ఆయనా నువ్వు గలాటా పడుతున్నారు.'

'నువ్వేరగందేముంది? మొక్కుకోమంటాడు పిల్లలకోసం. దేవుడ్ని మొక్కుకుంటే ఏమవుతుంది? అన్నాను....అదీ గలాటా' సింగడు మీసం మెలిపెట్టాడు.

'దద్దమ్మ అని ఆడదాన్ని డబాయిస్తాడూ దద్దమ్మ' సింగడు గొణిగాడు. సుబ్బి ఏమీ అనలేదు. మెదలకుండా బుట్ట నెత్తిన పెట్టుకుని బయలుదేరింది.

రోజూ కాయలన్నీ అమ్ముడు పచ్చేది. ఆ రోజు సగం కాయలు తట్టలో మిగిలి పోయినాయి. ఇంటికి రావటంగూడా బాగా ఆలస్యమయి పోయింది. చందమామ బాగా పైకెక్కాడు.

అప్పటిదాకా పెద్ద పులిలాగా గంతులువేస్తున్న వెంకయ్య సుబ్బి రాగానే చివాలున లేచాడు.

'ఎక్కడికి పోయావే యింతదాకా...సింగడెక్కడ చచ్చాడే...' సుబ్బి తట్ట నిలువెత్తునుంచి కిందకి కూలవేసింది. కింద దొర్లిపోతున్న కాయలన్నీ వెంకయ్యను వెక్కిరిస్తున్నాయి.

'ఏమే మాట పెగలటంలా? సింగడేడీ...అంట.'

'సింగడూ...రంగడూ నాకేం తెలుసు! నా వెంటేసుకునిపోయానా.'

'ఇంత ఆలస్యం అయిందే, ఎక్కడెక్కడ తిరిగి వచ్చావేం!'

'కాయలేమన్నా అమ్ముడుపోతేనా...మాలపల్లిదాకా పోయి రావలసి వచ్చింది; అట్టా అయినా సగం తేలలా...'

మరి సింగడేడీ...'

'అదేమాట అడుగుతావు...నాకు తెలవదని చెప్పటంలా.'

వెంకయ్య గుడిసెలోకి చొరబడుతూ 'కూడు ఇయ్యాలేమన్నా వుడకేసి పెట్టేమాటేమన్నావుందా' అన్నాడు.

'లేకేం...నీకోసం కాకపోయినా నాకోసమయినా చేసికోవద్దూ' అంది సుబ్బి.

సింగడు ఒక గంట తర్వాతగాని రాలేదు. వస్తూండగానే అడిగాడు వెంకయ్య 'ఎక్కడినుంచిరా రావటం' అని.

'కొంచెం ఆలస్యమయిందిలే...!'

'అందుకునేగా అడగటం...'

'మా సేయితుడు వచ్చాడులే! మా వూరు కాడనుంచి...'

ఆ రాత్రి...అంతా ఆరుబయటే పడుకున్నారు. ఒక రాత్రివేళ వెంకయ్యకు మెలుకువ వచ్చింది. సుబ్బి చాపమీద లేదు. సింగడు మంచంమీద కనపడలేదు. కంగారు పడుతూ లేవబోయేసరికి ఎదురుగుండా ఉన్న మామిడిచెట్టు కొమ్మమీద నుంచి కొరివిదయ్యంలా ఒకటి వేళ్లాడుతున్నట్లు కనిపించింది. ముసుగు తలనిండా పెట్టుకుని ఆంజనేయ దండకం పఠనం చేసి నిద్రపోయాడు.

తెల్లవారగానే మామిడిచెట్టు కొమ్మమీదనుంచి వేళ్లాడుతున్న తెల్ల చీరె కనపడింది.

'ఆ చీరె అక్కడ తగలేశారెందుకు...రాత్రి చాలా భయం వేసింది...!' కంగారు వెళ్ళబుచ్చాడు వెంకయ్య...వస్తున్న నవ్వు ఆపుకుంది సుబ్బి. సింగడు పైకి పకపకా నవ్వేశాడు.

'చీరెల్ని చూస్తేనే ఇంత భయం అయితే మనుష్యుల్ని చూస్తే ఇంకేమన్నా వుందా.'

'తెలివితేటలు మరీ ఎక్కువయినట్లున్నాయే...'

'మామిడికాయలు బాగా వంటబట్టినాయి...'

సుబ్బి ఈసారి మళ్ళీ నవ్వు ఆపుకోలేక పోయింది. వెంకయ్య రుసరుసలాడుతూ 'మళ్ళీ బేరగాళ్లు వస్తారు...తొందరగా చెట్టెక్కు...' అన్నాడు.

రోజులన్నీ కలిసి మూడు నెలలు అయిపోయినాయి. వెంకయ్య బాగా మారిపోయాడు. అయినదానికి కానిదానికి చీకాకు బాగా ఎక్కువయింది. సింగడు అంటే అసహ్యం, అసూయ బాగా పెరిగిపోయినాయి. అతడు యింట్లోనుంచి తెల్లవారగానే ఎంత తొందరగా బయటికి వెళ్లిపోతే అంత సుఖంగా వుంటుంది, వెంకయ్యకు. సుబ్బిని

యింట్లోనే వుండి పోమ్మని చెప్పటానికి ధైర్యంచాలటం లేదు. అతికి పోయే అబద్ధంకోసం చాలాకాలం ఆలోచించి ఏమీతోచక ఊరుకున్నాడు.

మామిడికాపు అంతా అయిపోయింది. ఆచారంకోసం అట్టే పెట్టిన కాయలు మూడింటిలోనూ పెద్దకాయను చిలక కొట్టేసింది. సింగడు చెట్టుకింద కొత్తగుడ్డ పీలికలు చిన్న పోగుచేసి కూర్చున్నాడు. చేతిలో సూదీ, దారం ఆడిపోతోంది. వెదురుపుల్లలు బాణంలాగా వంచినవి మానుకు ఆనించి పెట్టాడు:

'ఏమిటిరా ఈసరంజామా...అంతా'?

'రథం కటుతున్నాను ...బాగుందికదూ!'

'ఇంకా కట్టలేదుగదా...కట్టిన తర్వాత బాగానే ఉండచ్చులే... చిన్న పిల్లాడిలాగా ఏమిటా పనులు...ఇంకేదన్నా పని చూసుకోరాదూ...'

'చూసుకుంటానులే...ఈ పని పూర్తికానీ...ఇదయినా నాకోసం కాదులే...నీకు పుట్టబోయే పిల్లాడికోసం...'

'నాకా......? పెద్ద ఆఘాతం తగిలింది వెంకయ్యకు. సింగడి చేతిలో కాగితాన్ని, గుడ్డపీలికల్ని తీసుకుని చిందరవందరగా విసిరి పారేశాడు గావు కేకలు పెడుతూ.

సుబ్బి వచ్చింది—అప్పుడే తట్ట నెత్తినపెట్టుకుని.

'ఇటురా...సుబ్బీ...' జుట్టుపట్టుకుని గబగబా గుడిసెలోకి లాక్కుపోయాడు. ఈహఠాత్పరిణామానికి చాలా కంగారు పడిపోయింది సుబ్బి.

'నిజమేనా...చెప్పు...నిజంచెప్పు...'

'ఏ సంగతి చెప్పకుండానేనా...'

'ఆ మాట నా నోటినుంచి వస్తేనేగాని సారస్యం పూర్తికాదా...'

'మరీ బాగుందే అసలు గొడవ ఏమిటో చెప్పకుండానేనా....'

'చెప్పాలే...చెప్పాలేంనీకు.... సింగడికి నీ సంగతి తెలిసిందిగాని నీ సంగతే నీకు తెలియటంలా.'

సుబ్బి మనస్సుకు అర్థమయింది వెంకయ్య ఆవేదనంతా. మూల వంకెనున్న చీరె తీసి మడతలు పెటుతూ 'నీకూ తెలిసిందిగా మళ్ళీ నేను చెప్పేదేముంది?

వెంకయ్య కళ్లు ఎర్రబారినాయి. దుఃఖం వచ్చినంత పనయింది. కనుకొలకులలో నిండిన నీటి బిందువుల్ని కింద పడకుండా పై గుడ్డతో అద్దుకుని 'ఫో అవతలికి...నా కంటికి కనపడక...' బిగ్గరగానే అరి చాడు. సుబ్బి మాట్లాడకుండా వెళ్లిపోయింది.

సింగడు వాకిట్లోనే ఎదురు పడ్డాడు.

సుబ్బీ యిట్లారా...'

'ఏం...'

'వెంకయ్య ఏంటి గదమాయిస్తున్నాడు...'

'ఏముంది...మామూలేగా...'

'యియ్యాల్నించి నిన్ను పల్లెత్తు మాట అనటానికి వీల్లేదు...ఎరు గున్న మడిసిగందా అని వూరుకుంటే...యవారం మాయిదిగా వుందే...'

'వూరుకో...వింటాడు...'

'ఏం వింటే మాలావు...ఏదో వకటి తేలిపోవాలి...'

'ఏమిటిరా తేలిపోయేది...కూటికిలేని వాడివిగదా అని యీడకి తెచ్చినందుకు...కొమ్ములు మొలిచాయే...'

'ఏం మొలవక.... మొలిచే రోజులొచ్చాక నువ్వాగమంటే ఆగు తాయా...'

'అయ్....డొక్క చీరేస్తాను....' చెంప ఛెళ్లుమని మోగింది. అప్పటిదాకా చేతిలోవున్న వెదురుబద్దని మామిడి మాను పైపుకు గిరవాటు వేసి కలబడ్డాడు సింగడు. వెంకయ్య తలపాగా తీసి నడుముకు చుట్టాడు. ఎరమీదికి దూకిన పెద్దపులిలాగా సింగడు మీదపడి బాదుతున్నాడు. సింగడి ఓర్పు చచ్చిపోయింది. వెంకయ్యను బలవంతంగా వక్కతన్ను తన్ని బలంగా గుండెల్లో గుద్దాడు.

కుస్తీ పందెమని ముందరగా కబురు చేసేటట్లయితే చాలామంది వచ్చి ఆనందించే వాళ్లేగాని యిప్పుడు వక్క సుబ్బి మాత్రం చూస్తోంది. ఆమె మనసు రాలిపోయిన ఎండు మామిడాకులా రెపరెప లాడుతోంది. వారిద్దరిలో ఎవరు ఓడిపోయినా తన ఓటమిగానే అవుతుంది సుబ్బికి.

వీధిలో రెండు కుక్కలు పోట్లాడుకుంటుంటే అదురుగుండెతో నిలబడి చూస్తున్న మూడోకుక్కలా వుంది సుబ్బి పరిస్థితి.

సుబ్బి వాళ్ళిద్దరి మధ్యకుపోయి విడదీయటానికి ప్రయత్నించింది. వెంకయ్య కొంచెంగా తగ్గటానికి ప్రయత్నంచేశాడు. సింగడు ఆవేశంలో తలమీద మోపైన దెబ్బ కొట్టాడు. వెంకయ్య 'అమ్మో' అంటూ అరుస్తూ నేలమీదికి వరిగాడు.

సుబ్బి శేఖరం గారింటికిపోయి చెప్పింది జరిగినసంగతి. ఇంటి పక్కనే వున్న డాక్టరును వెంటపెట్టుకుని వచ్చాడు శేఖరం.

వెంకయ్య స్పృహ లేకుండా పడివున్నాడు. డాక్టరు వెంటనే ఏదో ఇంజెక్షను యిచ్చాడు. సుబ్బి తాటాకు విసిని కర్రతో విసురుతునేవుంది. తన చేతి దెబ్బతిని తన్నుకుంటున్న పామును చూస్తున్నట్లుంది సింగడికి.

వెంకయ్యకు ప్రాణంవచ్చింది. తెలివి రావటంతోనే 'నిన్నేం చేస్తానోచూడు' అంటూ పైకిలేచాడు. డాక్టరు అదిమిపెట్టి విశ్రాంతి చాలా అవసరమని చెప్పాడు.

శేఖరం 'సింగడిని పోలీసులకు అప్పచెపుతా' నన్నాడు. సుబ్బి వద్దంది-సింగడు మీసాలు మెలిపెటుతూ చెట్టుమాను ఆనుకుని నిలబడ్డాడు.

వెంకయ్య బాగా కోలుకునేటప్పటికి బాగానే పొద్దు ఎక్కింది. ముభావంగా లేచి గుడిసెలోకిపోయి అన్నం తిన్నాడు. రోజూ సింగడిని అన్నం తినేటప్పుడు పిలిచే అలవాటు. ఈ రోజు సింగడు తనంతటతనే వచ్చాడు. వాడికి అన్నం పెట్టటానికి వీల్లేదన్నాడు వెంకయ్య. 'నీ సొమ్మేం పెట్టటం లేదుగా' అన్నాడు సింగడు. మళ్ళీతగాదా పెరుగుతుందేమో నని భయపడింది సుబ్బి. ఎందుకనో సర్దుకుపోయింది. వెంకయ్య పొద్దున తిన్న దెబ్బలు మరిచపోక పోవటం వలననే తగాదా అణిగిపోయి వుండాలి.

బాగా చీకటిపడేవరకు వెంకయ్య యిల్లంతా తిరుగుతునే వున్నాడు. సుబ్బి తప్పించుకు తిరుగుతోంది. సింగడు బజారుకు పోయాడు.

'వాడిచేత కొట్టిస్తావుటే నన్ను....అ... వెంకయ్య సుబ్బి జుట్టు పట్టుకుని వక్క అరుపు అరిచాడు. సుబ్బి నిర్ఘాంతపోయింది.

అందని లోతులలోనుంచి చెలరేగే మానసికమైన వేదన ఎవ్వరూ ఇంతవరకూ జ్యోతిషం చెప్పలేని అనేక విషయాల్లో వకటిగా వుండిపోయింది. అణిగి పోయిందనుకున్న అగ్ని మళ్ళీ చెలరేగటానికి కావాలసిన వాతావరణం చాలా ప్రధానమయిన విషయం అనిపిస్తుంది. సుబ్బి ఆశ్చర్య పడటంలో వింత కలిగించే విషయం ఏమీలేదు.

వెంకయ్య చేతికొచ్చినట్లల్లా బాదుతున్నాడు. సుబ్బి రోదిస్తోంది. తనకేమీ తెలియదంటుంది.

'పొద్దున్నే వెళ్లి చెప్పింది నువ్వుగాదూ...'

'........'

'యిదిగో ఆఖరిసారి నీతో చెప్పేస్తున్నాను...నాతో వుంటావా చచ్చినట్టు యిక్కడపడివుండు—లేదంటావా సింగడు నువ్వు కలిసి ఏ గంగలోనన్నా దిగండి—'

'గంగలు అక్కర్లేదు....కిష్టలూ అక్కర్లేదు...'సుబ్బి నీరసంగా గొణిగింది.

'సిగ్గులేదూ...యింకా మాట్లాడుతున్నావు...

'మీకు లేనిది...నా కెందుకు...'

'ఆ...సింగడితో నీకేంటే సంబంధం... కట్టుకున్న మొగుణ్ణి నే వున్నాక...'

'ఆ....వున్నారు...మూడేళ్ళయింది...కట్టుకుని...'

'మూడేళ్లయితే ఏం....ముప్పై ఏళ్లయితే...'

'నా కంత ఓపికలేదు...దేవుడికి మొక్కుకోటాలూ అవీ నాకు చేతకావు...నాకు దేవుడికంటే మనుషులమీదే నమ్మకం ఎక్కువుంది...'

'నన్ను కాదనటం కాకుండా దేవుడ్నికూడా కాదంటావుటే... ఆ...' రొప్పుతున్నాడు వెంకయ్య.

'ఎందుకు ఇంత గందరగోళం...కట్టుకున్నవాడిని నిన్నొదిచి ఎక్కడికి పోతాను.... పిల్లడిమీద మోజు కలిగిందిగాని, సింగడేం నాకు ఎక్కువకాదు...నువ్వు తక్కువాకాదు...'

వెంకయ్య ఆవేశం పరవళ్లుతొక్కింది. తన వ్యక్తిత్వాన్ని కట్టుకున్న ఆడది నిలువునా కాల్చేస్తుంటే వళ్లుమండిపోక ఏం చేస్తుంది? అతనికి కిందూ మీదు తెలియలేదు. పక్కనేవున్న పచ్చడిబండ తీసుకుని సుబ్బితలమీద బలంగా మోదాడు. సుబ్బి నేలకూలిపోయింది.

వెంకయ్య గబగబా శేఖరంఇంటికి పరిగెత్తాడు. శేఖరంఅప్పుడే ఆరుబయట వాలుకుర్చీలో పడుకుని పేపరు చదువుకుంటున్నాడు.

'బాబుగారు కొంప మునిగిపోయిందండి....'

'ఆ.... ఏమయిందిరా....'

'సుబ్బిని చంపేశాడండి...ఆసింగడు'

'ఆ...ఎక్కడున్నాడు...ఎక్కడ'

'పారిపోయాడండి ... పట్టుకుందామంటే అందలేదు మీకోసం పరుగెత్తుకుంటూ వచ్చాను...'

కట్టుకున్నలుంగీతోనే పైబట్టన్నా లేకుండా శేఖరం పరిగెత్తాడు వెంకయ్యవెంట. సుబ్బి స్పృహలేకుండా పడిపోయివుంది.

'పొద్దున నన్నే చంపటానికి ప్రయత్నంచేశాడు.' వెంకయ్య మాట్లాడేస్తున్నాడు. ఆతని నాలుక మధ్య మధ్య ఎదురుతిరుగుతోంది. పెదిమలు తడబడుతున్నాయి.

శేఖరం మనుష్యుల్ని పంపించాడు సింగడిని వెదికిపట్టుకురమ్మని. సింగడికి ఈ సంగతి తెలియగానే అడ్డదారిన పరుగెత్తుకుంటూ వచ్చాడు. వెదకటానికి పోయినవాళ్లు తరువాత అరగంటకిగాని తిరిగి రాలేదు.

తలపగిలి పడివున్న సుబ్బిని చూచేటప్పటికి సింగడి గుండె పగిలి పోయింది. గుడిసెలోపలికి వస్తూనే 'సుబ్బీ...'అంటూ బిగ్గరగా ఏడుస్తూ ఆమెమీద విరుచుకుపడి పోయాడు.

వెంకయ్య 'అడుగోనండి...'అంటూ అరిచాడు. శేఖరం విస్తు పోయాడు.

ఆఖరిసారిగా సింగడిని చూడగలిగినందుకు సుబ్బిముఖంలో అతి పేలవమైన సంతృప్తిరేఖ గోచరించి వెంటనే అదృశ్యమయింది. ముఖం నల్లబడిపోయింది. వెంకయ్య అదే పనిగా ఏడుస్తున్నాడు.

సింగడు నల్లబారిన ముఖం చూడలేక వాకిట్లోకివచ్చి నిలబడ్డాడు.

'ఎక్కడికీ పోతున్నావు...ఆగు...' శేఖరం గద్దించాడు.

'నాసుబ్బినొదిలి నేనెక్కడికిపోతాను' గద్గదమైంది సింగడిగొంతు.

'వీడిని తీసికెళ్ళి పోలీసుస్టేషనులో అప్పగించి యిక్కడికి సర్కిలు యినస్పెక్టరుని వెంటనే పిలుచుకురండి...' అక్కడే నిలబడి చూస్తున్న ఇద్దరు బంట్రోతులను పురమాయించాడు.

సర్కిలు రావటానికి ఎక్కువసైేం పట్టలేదు. సింగడు సర్కిలు వచ్చేటంతవరకు ఎవరెంత బలవంతంచేసినా కదలలేదు. మామిడిచెట్టు మానుక్రిందిగుడ్డపేలికలన్నీ సర్దుతూ అక్కడే చతికిలబడి కూర్చున్నాడు.

'ఎవరు హత్యచేసింది ...ఎవరు .... ఎక్కడ ...' గుడిసెలోకి వస్తూనే కంగారుగా అడిగాడు సర్కిలు.

సింగడు చేతిలోవున్న గుడ్డపేలికల్ని గిరవాటువేసి 'నే నేనండి సుబ్బినిచంపింది' అన్నాడు.

వెంకయ్యఏడుపుఅకాత్తుగాఆపి అతివిస్మయంతో లేచినుంచున్నాడు. సింగడు వెంకయ్య దగ్గరకువచ్చి నిలబడ్డాడు. శేఖరం అందుకుని 'ఇతనే నటండీ తలమీదకొట్టి పారిపోయాడు....మళ్లీ మనుష్యులుపోయి పట్టుక వస్తే వచ్చాడు....' సింగడివైపు చూపించాడు.

'చేతులకు బేడీలువేయండి....' ఆర్డరు జారీచేశాడు సర్కిలు. వెంకయ్య కొయ్యబారిపోయిచూస్తూ నిలబడిపోయాడు.

'సుబ్బిని పాపని పంపిందికాక ... అదేలోకానికి నన్ను గూడా పంపించబోతున్నందుకు .... నీకెంతో రుణంవుంటుంది వెంకయ్య ...' అన్నాడు సింగడు తనకు ఉరిశిక్ష ఖాయమని నిర్ధారణచేసుకుని.

అనుకోని అనుభూతులు అనేకంవస్తూంటే పరిస్థితుల ప్రాబల్యానికి తలవగ్గి ఆఖరికి దాని యినుప పళ్ళమధ్యనే నలిగిపోతుంటాయిజీవితాలు. అందులో సింగడి జీవితం చేరిపోక ప్రత్యేకించి వుండేటంత మనోదార్ఢ్యంలేదు. ప్రాణంలాగా చూసుకునే సుబ్బి, తన వునికికి ఛాయ లాంటి పుట్టబోయే పసిపాప తననివిడిచిపోయాక ఇంకెవరికోసం

ఈ లోకంలో నిరర్థక జీవితం గడపాలి. వెంకయ్య సమయస్ఫూర్తికి మెచ్చుకున్నాడు సింగడు.

సుబ్బిని ఆసుపత్రికి తీసుకొనిపోయి శవపరీక్షచేయాలన్నారు. హత్యకు అంగీకరించిన తర్వాతగూడా సుబ్బి శరీరాన్ని చిత్రవధచేస్తేనే గాని తనుచేసిన పాపాలకు పరిపక్వం కలగదేమో? సింగడు ఆలోచిస్తూ పోలీసుల వెనక నడచి వెళ్లుతున్నాడు. వెంకయ్య గేటుదాకావచ్చాడు.

'ఇప్పటికీ నీకంటే నేనే అదృష్టవంతుడినిలే' అన్నాడు సింగడు ఎండిపోయిన పెదవులమీద వికృతమందహాసం వెదజల్లుతూ.

'అంతా నన్ను విడిచిపోతున్నారు ... నేనేంచెయ్యను' గొణుగుకున్నాడు వెంకయ్య. పిరికిగుండెలోపల దడ దడ లాడింది.

హంతకుడే నేరంవప్పుకున్న తర్వాత కోర్టులో జూరీలపని చాలా వరకు తగ్గిపోయింది. కోర్టులో వెంకయ్య సాక్ష్యంచెప్పాడు. సింగడు పచ్చడిబండతో బాదుతుంటే తనుచూసినట్లూ ... వారించపోతే తనను విదిలించి పారిపోయినట్లూ...తను భయపడి శేఖరంగారి దగ్గరకుపోయి జరిగిన సంగతి విన్నవించినట్లూ...' సింగడు పకపకనవ్వాడు కోర్టుహాలు దద్దరిల్లేటట్లు. 'ఆర్డర్ .... ఆర్డర్ ....' అంటూ అరుపులు వినవచ్చాయి. ఎవరినైనా భయంకరమైన చూపులు హడలగొటతాయిగాని, ఆవికృతమైన నవ్వే వెంకయ్యను బేజారుచేసింది. భయపడుతూ కిందకు పారిపోయి వకమూలగా కూర్చున్నాడు.

కోర్టు తీర్పుఇచ్చేసింది. సింగడిని శనివారం ఉరితీసెయ్యాలి. జస్టిస్ శేఖరం మనసు చాలా ఆందోళనగావుంది. సాక్ష్యాలతో సరిపోని లోకంలోనుంచి అతనికిమాటలు వినబడుతున్నాయి 'సింగడు హంతకుడు కాడని...' సాక్ష్యం బలంగావుంది. శేఖరం తీర్పుచెప్పేసి చేతిలోవున్న కాగితాలను బలంగా బల్లమీదకొట్టి కిందకుదిగిపోయాడు.

కోర్టువారు సింగడిని చెప్పేదేమన్నా వుందా అంటే చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. వెంకయ్య సాక్ష్యంచెపుతుంటే పకపకానవ్వాడు.

పోలీసులు అతన్ని కిందకు తీసుకుపోతుంటే కారులో ఎక్కుతున్న శేఖరాన్నిచూసి 'మీమేలు మరవలేనండి....' అంటూ నమస్కారం

చేశాడు. శేఖరం తలుపు ఫెడేలుమని వేసుకుని 'ఇంటికిపద' అన్నాడు డ్రైవరుతో.........

*   *   *   *   *

శేఖరం బరువుగా కిటికీలోనుంచి తన మామిడితోటవైపుచూస్తు న్నాడు. వెనకవైపునుంచి బంట్రోతువచ్చి 'మిమ్మల్ని చూడటానికి వెంకయ్యొ వచ్చాడండి' అన్నాడు.

'ఇంతపొద్దున్నే ఏంపనివచ్చిందిరా సాయంత్రంవచ్చి మాట్లాడ మను....'

'ఇప్పుడే చూడాలంటున్నాడండీ...'

'వీల్లేదని చెప్పు...'

వెంకయ్య బంట్రోతును తోసుకుంటూ గదిలోపలకివచ్చిపడ్డాడు.

'బాబూ...అన్యాయం జరిగిపోయిందండి...'

'ఏంటిరా....మళ్ళీ ఏం వచ్చింది....'

'సింగడిని అన్యాయంగా చంపారండి...'

'ఎవరూ...నేనా....నీమతిపోయిందేమిటి...ప్యూన్ వీడిని బయ టకు గెంటెయ్యి....'

'నాపనికావటంతోనే నేనేపోతాను. సుబ్బిని చంపింది సింగడు కాడు ... నేనే ... నేనే చంపాను ... కడుపు ఉడికిపోతే తొందరపా టులో తెలియక బండపెట్టి కొట్టాను...ఇంత ప్రమాదంగా తగులు తుందని అనుకోలేదు అయ్యగారూ...' పసిపిల్లవాడిలా ఏడుస్తున్నాడు. శేఖరం మతి భ్రమించినవాడిలా వక్కసారి మంచంమీదనుంచిలేచి మళ్లీ కూర్చున్నాడు.

'నేను ఆవేశంలో సుబ్బిని చంపుతే...నిజం తెలుసుకోలేకుండా బూటకపు సాక్ష్యంమీద బాగాఆలోచించి మాసింగడిని మీరు చంపారు... నా సింగడిని నాకివ్వండి....నాకివ్వండి...' శేఖరం పాదాలు పట్టుకుని తలబాదుతున్నాడు వెంకయ్య. విదుల్చుకుంటున్నాడు శేఖరం.

'వూరికే అరిచావంటే....'గదమాయించాడు శేఖరం.

'నా సింగడిని నాకప్పచెప్పండి....లేకపోతే నేనూ వాడిదగ్గరకే పోతాను...మీతోటపని నాకక్కరలేదు...'

వెంకయ్యని వదిలిపెటితే ఆత్మహత్య చేసుకుంటాడేమోనని భయంవేసింది శేఖరానికి. వదిలిపెట్టక ఏంచెయ్యాలో తోచలేదు. పిరికి గుండెతో మామిడిచెట్టువైపు చూచాడు. పెద్దమామిడిచెట్టు సింగడి అస్థిపంజరంలాగా కనపడుతోంది.

శేఖరం వెంకయ్యచేతులను తనచేతుల్లోకి తీసుకొని 'యిద్దరమూ హంతకులమే అయ్యాం.... ఇప్పుడేంచేద్దాం వెంకయ్యా....' అని భోరుమని ఏడ్చాడు. వెంకయ్య అతని చేతులు విదిలించి కాళ్ళుపట్టుకొని 'మీరేంచెపితే అదిచేస్తాను బాబూ' అన్నాడు.

'నా తోటవిడిచీ, నన్ను విడిచీ వెళ్ళిపోక...నువ్వు లేందే నేను బతకలేను' అన్నాడు శేఖరం కుప్పగా కూలిపోతూ.

★